# క్షమ

కిరణ్మయి పేరు అందమైనదే అయినప్పటికీ పేరుకంటే కూడా ఆమె అందంగా ఉంటుంది. చిన్నతనం నుండీ ఆమె అందానికి మంచి గుర్తింపు లభించేది. ఇంటికి ఎవరొచ్చినా 'ఈ పాప చాలా ముద్దుగా ఉంటుంది'.. అని అప్రయత్నంగా అనేవారు. పదిమంది పిల్లలతో ఆడుకుంటున్నప్పుడు సినిమాల్లో ఎక్స్‌ట్రా బాలనటుల మధ్య ముఖ్య బాలనటిలా ఉండేదామె. ఆమెకు పది పన్నెండేళ్ళు వచ్చేసరికి - ఈ పిల్ల కింకాస్త వయసొస్తే సినిమా స్టార్లా ఉంటుంది - అనుకునేవారు చాలా మంది యువకులు. ఆమెకు మరి కాస్త వయసొచ్చేసరికి ఎందరో యువకులామె సౌందర్యానికి దాసోహమన్నారు. కాలేజీలో ఉండగా ఆమెకు చాలా ప్రేమలేఖలు వచ్చేవి. కొంతమంది ధైర్యవంతులు ఎదుటపడి తమ ప్రేమను వెళ్ళబుచ్చుకున్నారు కూడా. అయితే కిరణ్మయి ఎవరినీ ప్రేమించనూ లేదు. అలాగని ఎవరికీ దూరంగానూ లేదు.

ప్రతీ అందానికీ ఒక ప్రత్యేకత ఉంటుంది. కిరణ్మయి అందానికి ప్రత్యేకత ఆమె క్షమాగుణం!

కిరణ్మయి ఆరేళ్ళ వయసప్పుడు వారింటి పొరుగున ఇంచు మించు ఆమె వయసుదే అన్నపూర్ణ అనే అమ్మాయుండేది. అన్నపూర్ణ అందంగా ఉండదు. దానికితోడు ఆమెకు అసూయ కూడా ఉంది. అందరూ కిరణ్మయి అందాన్ని పొగుడుతూంటే అన్నపూర్ణకు చాలా అసూయగా ఉండేది. ఒక రోజా అమ్మాయి కిరణ్మయిని మెల్లకంటి పిల్ల అని వెక్కిరించింది. అయినా కిరణ్మయి కోపగించుకోకుండా నవ్వి ఊరుకుంది. ఆ నవ్వుకు రెచ్చిపోయి అన్నపూర్ణ కిరణ్మయినింకా పలువిధాలుగా వెక్కిరించింది. దేనికీ కిరణ్మయి చలించలేదు. అప్పుడా అమ్మాయికి కోపం వచ్చి కిరణ్మయిని గట్టిగా కొట్టి పారిపోయింది. కిరణ్మయికి దెబ్బ నుదుటి మీద తగిలింది. రక్తం కూడా వచ్చింది. కిరణ్మయి ఏడుస్తూ ఇంటికి వెళ్ళిపోయింది. కానీ తననెవరు కొట్టారో వెంటనే చెప్పలేదు. దెబ్బ తగ్గిపోయాక "నేనందంగా ఉంటానని అన్నపూర్ణకు కోపం. అందుకే అది నన్ను కొట్టింది. కానీ దాన్నేమీ అనవద్దు. మేమిద్దరం మళ్ళీ ఫ్రెండ్సయిపోయాం" అని తల్లికి చెప్పింది.

కిరణ్మయికి పదహారేళ్ళప్పుడు స్కూల్లోని కుర్రకారుకి ఆగడం కాస్త కష్టంగా ఉండేది. అసలే వస్తున్న సినిమాలు మంచివి కావు. కిరణ్మయి సినిమా స్టారుని మించి ఉంటుంది. ఏమాత్రం వీలుపడినా ఆమెను తాకాలనీ - ఇంకా ఏవో చేయాలనీ విద్యార్థులు కొందరు ప్రయత్నిస్తూండేవారు. ఒకరిద్దరు ధైర్యం చేసి కన్ను కొట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇలాంటి వ్యవహారాల్లో చూసీ చూడనట్లూరుకుని తన జాగ్రత్తలో తనుండేది కిరణ్మయి. రిపోర్టిచ్చి కుర్రాళ్ళ జీవితం నాశనం చేయడమామెకు నచ్చదు. చెప్పు తీయడమూ, చేయి విసరడమూ, కుర్రాళ్ళను మరింత రెచ్చగొడుతుందని ఆమెకు తెలుసు. తన సహనాన్ని ప్రదర్శిస్తూ, ప్రవర్తనలో తన మంచితనాన్ని నిరూపించుకుంటూ రోజులు వెళ్ళబుచ్చేదామె. ఆ విధంగా మగకుర్రాళ్ళు కూడా ఆమెను లైక్ చేసేవారు.

కిరణ్మయి కాలేజీలో చేరాక కాలేజీలో పెద్ద సంచలనం కలిగింది. కాలేజీలో ఆమె మిగతా ఆడపిల్లల మధ్య చెలికత్తెలలో రాజకుమారిలా మెరిసిపోయేది. విద్యార్థుల్లో ఆమె కెన్నో ఉపగ్రహాలు తయారయ్యాయి. ఆమెకు దరిదాపుల్లో ఒక పరిధి ఏర్పరచుకుని ఎప్పుడూ ఆ పరిధిలోనే ఉండడానికి ప్రయత్నించే వారు చాలా మంది విద్యార్థులు.

కాలేజీ వాతావరణం కిరణ్మయిని ఉక్కిరిబిక్కిరి చేసిందనే చెప్పాలి. హైస్కూల్లో విద్యార్థులలో చొరవ తక్కువ. ఆవేశమున్నా ఎందుకో తెలియదు. కాలేజీ కుర్రాళ్ళ భావాల్లో స్పష్టత ఉంది. చొరవ కూడా కాస్త ఎక్కువే!

చాలా మంది కుర్రాళ్ళు కిరణ్మయికి పుస్తకాలు మోశారు. లాబరేటరీలో బీకర్లు కడిగిపెట్టారు. అడిగిందే తడవుగా నోట్సు లిచ్చేవారు. చిరునవ్వుతో కూడిన థాంక్స్ ఆమె నుంచి లభిస్తే అదే వారికి పండుగగా ఉండేది.

కిరణ్మయి సెకండియర్లో ఉండగా ఆమె రికార్డులో ఏదో తప్పుందని కెమిస్ట్రీ లెక్చరర్ ఆమెను తన గదికి పిలిచాడు. రెండు క్షణాలు అవీ ఇవీ మాట్లాడి చటుక్కున ఆమెను కౌగలించుకుని ముద్దు పెట్టుకోబోయాడు. కిరణ్మయి విడిపించుకుంది. ఆవేశం చల్లారిన మేస్టరు కాళ్ళు పట్టుకోబోయాడు. కిరణ్మయి ఆయన్ను క్షమించింది.. "నా క్షమను అలుసుగా

తీసుకుని మళ్ళీ ఎన్నడూ ఇలాంటి పిచ్చి పనులు చేయకండి. మనిషి బలహీనతను ఒకసారి మాత్రమే నేను క్షమించగలను'' అంది కిరణ్మయి. ఆ తర్వాత ఆ లెక్చరర్ ఆమె పట్ల చాలా జాగ్రత్తగా ఉంటూ వచ్చాడు.

కిరణ్మయి అన్నయ్య వెయిట్ లిఫ్టర్. దానికి తగ్గట్లు అతనికి కోపం కూడా చాలా ఎక్కువ. ఒకసారి ఓ బక్కపలచని కుర్రాడు పార్కులో ఒంటరిగా ఉన్న కిరణ్మయికి వినపడేలా పచ్చిబూతు పాట పాడితే..ఆమె అతన్ని పిలిచి తన అన్నయ్య గురించి చెప్పింది. కానీ అన్నయ్యకతని గురించి చెప్పలేదు.

కాలేజీ జీవితంలో కిరణ్మయి క్షమకు పాత్రులైన వాళ్ళ గురించి చెప్పుకుంటూ పోవాలంటే ఈ కథ కంతముండదు. ప్రేమలేఖలు రాసిన వాళ్ళనీ, కన్ను కొట్టిన వాళ్ళనీ, బూతులు మాట్లాడిన వాళ్ళనీ, మీద చేతులు వేసిన వాళ్ళనీ చాలా మందిని ఆమె క్షమించింది. కొంతమంది కిరణ్మయి కటువంటి పనులు ఇష్టమేమో ననుకునే ప్రమాదముంది. శీలానికి సంబంధించినంతవరకూ ఆమె నిప్పులాంటి మనిషి. వయసులో ఆమె కంటే ఏడు సంవత్సరాలు పెద్ద అయిన ఆమె బావ ఆమెకు చిన్నప్పుడే వరుడిగా నిశ్చయమయ్యాడు. అతని పేరు మోహన్. పేరుకు తగ్గట్లుగా అందంగా ఉంటాడు. వాళ్ళిద్దరి జంటా చాలా బాగుంటుందని చూసిన వాళ్ళనుకుంటారు.

బావ మోహన్‌తో పెళ్ళయిపోయాక కిరణ్మయి క్షమా గుణానికి చాలా తరచుగా పని కలుగుతూండేది. మోహన్ ఉద్యోగం ఒక వ్యాపార సంస్థలో. అతనికి మంచి జీతమే; కానీ పని ఎక్కువగా ఉంటుంది. ఎక్కువగా ఉండడం మాత్రమే కాదు - అది ఎప్పుడు ఎక్కువగా ఉంటుందో తెలియని పరిస్థితి.

ఈ రోజు సాయంత్రం సినిమాకు వెడదామంటాడు మోహన్. కిరణ్మయి తయారవుతుంది. అతను బాగా ఆలస్యంగా వచ్చి మన్నించ మంటాడు. కిరణ్మయి క్షమించేస్తుంది.

ఈ రోజు నా పుట్టిన రోజు..సెలవు పెట్టండి అంటుంది కిరణ్మయి. సెలవు చీటీ ఇచ్చివస్తానని వెడతాడతను. మళ్ళీ సాయంత్రానికిగానీ రాడు. అతను మన్నించమంటాడు. ఆమె క్షమించేస్తుంది.

ఫలానా షాపులో ఫలానా రకం చీర వచ్చిందట..వెడదామంటుంది. ఆలాగే నంటాడతను. అతనికి తీరుబడయ్యేసరికి ఆ షాపులో ఆ చీరలుండవు. అతనడిగినా అడక్కపోయినా ఆమె క్షమించేస్తుంది.

''నీలో దేవుడెంత క్షమాగుణం పెట్టాడు?'' అంటూ భర్త ఆశ్చర్యపోతాడు.

'మీరు నాకేం లోటు చేస్తున్నారు? మీకు నా మీద ప్రేమకేం తక్కువయింది? ఆఫీసులో శ్రమపడి ఇంటికి వచ్చిన మీకు కావలసినది చల్లని చిరునవ్వు కానీ సాధింపు కాదుకదా.' దానికి క్షమాగుణమని పేరుపెట్టడం నాకు నచ్చలేదు. ఒక వేళ మిమ్మల్ని సాధించానే అనుకోండి. నా మాట మన్నించడమీకు సాధ్యపడుతుందా? ఉద్యోగపు టిబ్బందుల వల్ల మీరలా చేస్తున్నారు తప్పితే కావాలని చేయడంలేదని నాకు తెలుసును..'

అనేది కిరణ్మయి.

"ఇంత అందమైన భార్య ఉన్నందుకు పూర్తి న్యాయం చేకూర్చ లేకపోతున్నాను." అని బాధపడతాడు మోహన్.

కిరణ్మయికి తెలుసు. తన నతను అలక్ష్యం చేయలేడు. ప్రాణం కంటే మిన్నగా ప్రేమిస్తున్నాడు. ఎన్నో సరదాలు తీర్చుకోవాలని అతని కున్నప్పటికీ అతని ఉద్యోగ ధర్మం అడ్డువస్తోంది.

అయితే కిరణ్మయి క్షమాగుణానికి ఏదో ఒక రోజు పరీక్ష రాకపోదు. ఆ పరీక్షలో ఆమె ఓడిపోకనూపోదు. అదే జరగకపోతే ఈ కథ వ్రాయవలసిన అవసరమూ లేదు!

పెళ్ళయిన పది నెలలకు మోహన్ ఆమెను తీసుకుని హనీమూన్ బయల్దేరాడు. ఆమెను చాలా ప్రదేశాలు తిప్పాక చివరకు వాళ్ళిద్దరూ తిరుపతి వచ్చారు. అక్కడ ఓ కాటేజిలో ఇద్దరూ బస చేశారు. దైవ దర్శనమైపోయాక కిరణ్మయికి కళ్ళు తిరిగినట్లనిపించింది. భర్త ఆమెను దగ్గరుండి కాటేజీకి నడిపించాడు. కాటేజీకి వెళ్ళాక ఆమెను తలుపు వేసుకోమని అతను బయటకు వచ్చాడు. భార్యకు పళ్ళు, పాలు, కొని తేవాలని అతననుకున్నాడు. కాటేజీ దుకాణాలకు కాస్త దూరంగానే ఉంది.

భర్త ఇలా వెళ్ళాడో లేదో మళ్ళీ వెంటనే తలుపు తట్టిన శబ్దమై కిరణ్మయి తలుపు తీసింది. ఎదురుగా సుమారు పాతికేళ్ళ యువకుడున్నాడు.

"ఎవరి కోసం?" అందామె.

"నీ కోసమే" అంటూ లోనికడుగు వేశాడు చొరవగా.

ఆమెకు అనుమానం వచ్చినా చటుక్కున వెనకడుగు వేయక తప్పలేదు. అతను తలుపులు వేసే సరికి ఆమె కంగారుపడి అరవబోయింది.

"అరవకు..చావగలవు" అన్నాడతను క్రూరంగా. అప్పుడే అతని చేతిలోని కత్తిని చూసిందామె.

"ఎవరు నువ్వు? ఏం కావాలి?" అందామె భయం భయంగా.

"భయపడకు. అరవకపోతే నిన్నేమీ చేయను..." అన్నాడా యువకుడు.

కిరణ్మయికి నోట మాటరాలేదు.

"మెడలోని గొలుసు, నెక్లెస్, తాళిబొట్టుతో సహా తీసి అక్కడ పెట్టు. చేతి గాజులు, ఉంగరం, చెవుల రింగులు వగైరాలనీ ఒంటి మీద బంగారమంతా తీసి నా కిచ్చేయి..క్విక్.' అన్నాడు.

అతని చేతిలోని కత్తి తళతళా మెరుస్తోంది. ఆమె అతను చెప్పినట్లే చేసింది. అతను అవి అందుకుని వెళ్ళిపోబోయిన వాడే ఆగిపోయాడు.

"చూడు - నువ్వు కట్టుకున్న చీర చాలా బాగుంది. బ్లౌజు మాచింగనుకుంటాను. నీలాంటివాళ్ళు లంగా బాడీలతో సహా అన్నీ మ్యాచింగ్‌వే వేసుకుంటారు. అన్నీ ఇచ్చేయ్. ఊఁ త్వరగా - టైము లేదు"

సిగ్గుతో. భయంతో ఆమె స్థాణువులా నిలబడిపోయింది.

"నేను నిన్నేమీ చేయను. వెనక్కు తిరగడమో కళ్ళు మూసుకోవడమో చేయాలి. కానీ నేను దొంగను. రిస్కు తీసుకోలేను. ఆ మంచం మీద దుప్పటీ చుట్టబెట్టుకుని బట్టలన్నీ విప్పి ఇచ్చేయ్..నేను వెళ్ళాక డ్రస్సు మార్చుకుందువుగాని. అసలు మరేదైనా డ్రస్సు తీసుకుని పోయే వాణ్ణి. కానీ నువ్వు షో కేసులో బొమ్మలా కట్టుకుని ప్రదర్శించిన బట్టలివి. ఊ..క్విక్.." అన్నాడతను పొడారిన గొంతుతో.

కిరణ్మయికి గత్యంతరం లేకపోయింది. ఆమె దుప్పటీ చుట్టబెట్టుకుని బట్టలు విప్పేసింది. వాటిని ఇచ్చే లోపల అతనేం అఘాయిత్యం చేస్తాడోనన్న భయం ఆమెను వణికించేస్తోంది. విప్పిన బట్టలు అతని వైపుకి విసిరేసింది!

అతను జేబులోంచి చిన్న ప్లాస్టిక్ సంచీ తీసి మడతలు విప్పి బట్టలందులోకి సర్దాడు - "తిరుపతి దేవుడికి కూడా ఎవడూ ఇలాంటి నిలువు దోపిడీ ఇవ్వడు. నీ పాలిట నేనే దేవుణ్ణనుకో, నీ జన్మ ధన్యమవుతుంది. వస్తాను" అంటూ అతను కాటేజీలోంచి చరచరా వెళ్ళిపోయాడు.

కిరణ్మయి గబగబా ఇంకో చీర తీసి కట్టుకుంది. ఆమెకు అప్పటికీ ఇంకా భయం తీరినట్లు లేదు. ధైర్యం చేసి బయటకు వచ్చి చూసే సరికి ఆమె కాశ్చర్యం కలిగింది. బయట జనమెవ్వరూ లేదు. కానీ యాభై గజాల దూరంలో ఓ మనిషి నేల మీద బోర్లాపడి ఉన్నాడు. క్షణం తటపటాయించి కాటేజీ తలుపులు తాళం వేసి అతని వైపుకి నడిచింది. ఆ పడున్న మనిషి కొద్ది క్షణాల క్రితం తనను బెదిరించిన మనిషే! అతగాడి పక్కనే ఉన్న ప్లాస్టిక్ సంచీని ఆమె గుర్తించింది.

ఏమయిందతనికి? ఎందుకిలా పడిపోయాడు? - ఆమె మనసు ప్రశ్నలతో ప్రతిధ్వనించింది. సమాధానం దొరక్క సతమతమవుతున్న సమయంలో మోహన్ చేతిలో పళ్ళు, బిస్కెట్ పాకెట్‌తో వచ్చాడు.

కిరణ్మయికి భర్తను చూస్తూనే కొండంత ధైర్యం వచ్చింది. జరిగినదంతా గబగబా భర్తకు వివరించింది. మోహన్ అతన్ని శోధించగా వస్తువులన్నీ దొరికాయి. ప్లాస్టిక్ సంచీలో బట్టలున్నాయి. అతనికి స్పృహ మాత్రం లేదు. కొద్ది క్షణాలు సంకోచించిన కిరణ్మయి "ఏమండీ ఇతన్ని కాటేజీకి చేరుద్దాం!" అన్నది. మోహన్ తెల్లబోయి చూసాడు. ఆమె నిర్ణయం మారినట్లు లేదు. పైగా సొమ్ము దక్కాలి. గత్యంతరం లేక ఇద్దరూ పట్టి ఆ యువకుణ్ణి ఇంట్లోకి మోసుకెళ్ళారు. అయిదు నిమిషాలు ఫస్టు ఎయిడ్ చెయ్యగా ఆ యువకుడికి స్పృహ వచ్చింది. స్పృహ రాగానే అతను చివాలున లేచి కూర్చుని రెండు చేతులూ ఎత్తి వారికి నమస్కరిస్తూ -

"నన్ను మన్నించాలి. నేను దురదృష్టవంతుణ్ని. బాగా చదువుకున్నాను. ఉద్యోగం లేదు. ఆస్తి లేదు. పెళ్లాం మాత్రముంది. ఎక్కడైనా ఎవరైనా అన్యోన్యంగా దంపతులు కనపడితే నాకావేశం కలుగుతుంది. నా పెళ్ళానికి నేను సమకూర్చలేనివి చాలా ఉన్నాయి. అవన్నీ మరొ క జంట సమకూర్చుకుని నా కంటబడితే భరించలేను. బాధ నాలో రేగుతుంది! ఏం చేయను? నేనసమర్థుణ్ణి. మీ ఆవిణ్ని చూశాను. నా భార్యకా నగలూ, బట్టలూ కట్టబెట్టాలనిపించింది. జీవితంలో ఒక్కసారైనా అలంకరించి వీధిలో తిప్పాలనుంది. సులువుగా

సాధ్యపడదు నాకది. ఈ రోజల్లా మీ దంపతులని వెన్నాడుతూనే ఉన్నాను. కానీ నాకో బలహీనత ఉంది. నెర్వస్‌నెస్...అదొస్తే కళ్ళు తిరిగి పడిపోతూంటాను. బ్లడ్ ప్రెషర్ అన్నారు కొందరు. ఏమైనా అది నా దురదృష్టం. ఇంతవరకు దొంగతనాలు చేయలేదు. జేబులో కత్తి పెట్టుకు తిరుగుతున్నానని అనుమానించకండి...నా మాటల్లో నిజా నిజాలు మా ఆవిడనడిగి తెలుసుకోవచ్చు. నేను జైలు పాలయితే అది చచ్చిపోతుంది. నిండా ఇరవై లేవు దానికి.''

మోహన్ ఈ కథ నమ్మలేదు. కానీ అతని భయం - ఈ కథకు కిరణ్మయి లొంగిపోయి నిజంగానే తన బట్టలూ, నగలూ అతనికి దాన మిచ్చి క్షమించేస్తుందేమోనని. అయితే అతని కథను కిరణ్మయి నిర్లిప్తంగా విని, -

''ఇంకా ఏమైనా చెప్పాలా?'' అంది.

అతనింకా ఏమో చెప్పాడు. హృదయం కరిగించేలా మాట్లాడేడు.

''ఇతన్ని పోలీసుల కప్పగించండి''అంది కిరణ్మయి. ఆ తర్వాత ఆ యువకుడి ముఖం చూడ్డానిక్కూడా ఆమె అంగీకరించలేదు. పోలీసు స్టేషన్‌కు భర్తతో పాటు ఆమె కూడా వెళ్ళి జరిగినదంతా చెప్పింది.

తిరిగి వెళ్ళేటప్పుడు,'మన వస్తువులన్నీ మనకు దొరికాయి. నా అభిప్రాయంలో నువ్వు ఆ దొంగాడిని క్షమించి వదిలేస్తావనుకున్నాను. అతని కథ నువ్వు నమ్మలేదు కదూ?'' అన్నాడు మోహన్.

'అతని కథ నిజమేనని నాకు తెలుసు'' అంది కిరణ్మయి నమ్మకంగా.

''అతను నీకు తెలుసా?'' ఆశ్చర్యంగా అన్నాడు మోహన్.

''లేదు. ఒక అందమైన ఆడపిల్ల ఎదురుగా ఉంటే అతను ఆమె ధరించిన నగల్నీ, బట్టల్నీ మాత్రమే కోరాడు తప్పితే కనీసం ఆమె శరీరం మీదయినా చేయి వేయలేదు. ఇంతపిసరు కూడా ఉద్రేక పడలేదు. అంటే అతని దృష్టి వేరే - తన ప్రియురాలిపై ఉన్నదని తెలుస్తోంది గదా,'' అంది.

''నిజంగా వాడు నీ మీద చేయి కూడా వేయలేదా?'' పురుషత్వపు టనుమానాన్ని ప్రదర్శిస్తూ మోహన్ ప్రశ్నించాడు. దానికి కిరణ్మయి ఏం జవాబు చెప్పిందో మన కనవసరం.

ఎంతోమందిచేత ఎంతగానో ఆరాధించబడ్డ ఆమె సౌందర్యం, ఎందరినో ఎంతో తెగువకు పురిగొల్పే ఆమె సౌందర్యం, ఆ యువకుడికి విలువైనదిగా తోచలేదు. అతను కేవలం ఆమె ధరించిన నగలు, బట్టలు కోసమే తాపత్రయపడ్డాడు. అదీ మరో యువతికివ్వడం కోసం! అది తల్చుకునేసరికి కిరణ్మయిలో అహం ఆవులించింది. అప్పటి వరకూ ఆమెలో జాగృతమై ఉన్న క్షమ ఓ క్షణం కునికింది!

తనకు రక్షణ కవచంలా ఉండే క్షమ ఆ క్షణంలో అతన్నెందుకు ఆదుకోలేక పోయిందనేది కిరణ్మయికైనా తెలుసో, తెలియదో! ఒకవేళ తెలిసినా అదామె ఇతరులకు మాత్రం చెప్పదు!! ★

*(భరణి మాస పత్రిక - నవంబరు, 1977)*